క్లుప్తంగా

రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన



నర్సిపురం జంక్షన్ వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని బూరగాం, నర్సిపురం, దిమిలాడ, లింగాలపాడు, చిన్నమర్రిపాడు గ్రామాలను కలుపుతూ వేయనున్న రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఆర్అండ్బీ అధికారులు, టీడీపీ నాయకులు బి.శేషగిరి, పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, పి.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సరి చూసుకోవాలి

టెక్కలి: ప్రస్తుతం ఉన్నటువంటి ఓటర్ల జాబితాలను సరి చూసుకుని తప్పు ఒప్పులను గుర్తించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆడిటోరియంలో సంతబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన బీఎల్ఓలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలను మరోసారి సరిచూసుకుని వాటిని సక్రమం చేయాలన్నారు. అలాగే ఓటర్ల చేర్పులు, మార్పుల అంశాలకు సంబంధించి దరఖాస్తులు తీసుకోవాలని ఆర్డీవో పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

సంతబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునుడు కోరారు. ఈ మేరకు లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, సావిత్రి, పాల్గొన్నారు.

చింతామణి అమ్మవారికి వెండి కిరీటం వితరణ



అమ్మవారికి వెండి కిరీటం అలంకరించిన దృశ్యం

కవిటి: కవిటిలోని చింతామణి అమ్మవారికి అదే గ్రామానికి చెందిన బెందాళం చిట్టిబాబు, మంగమ్మ దంపతులు రూ. 1.50 లక్షల విలువ గల వెండి కిరీటాన్ని వితరణగా అందించారు. గ్రామ పురోహితుడు జి.మన్మథరావుస్వామి శుక్రవారం వెండి కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణల నడుమ కిరీటాన్ని అలంకరించారు. గ్రామసర్పంచ్ పూడి లక్ష్మణరావు, బెందాళం రమేష్, పొల్లాయి లక్ష్మణమూర్తి, పి.శేఖర్, మధు, రంగారావు ఉన్నారు.

సంపద తయారీపై అవగాహన కల్పించాలి



రావివలసలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో భారతిసౌజన్య

టెక్కలి: చెత్త నుంచి సంపద తయారీపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి భారతిసౌజన్య సూచించారు. రావివలస, పోలవరం పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కళాకారులతో పరిశుభ్రతపై కళాజాత నిర్వహించారు. సర్పంచ్‌లు ఎస్.బాలకృష్ణ, జి.చిన్నంనాయుడు, ఈఓపీఆర్డీ సింహాద్రి, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ ఉన్నారు.

గ్రామస్తుల చేతుల్లో కింగ్‌కోబ్రా హతం



గ్రామస్తుల చేతుల్లో హతమైన కింగ్ కోబ్రా

మందస: మందస మండలం బోగాపురం గ్రామంలో కింగ్ కోబ్రా కలకలం రేపింది. గ్రామంలోకి శుక్రవారం ప్రవేశించడంతో స్థానికులు సర్పాన్ని కొట్టి చంపేశారు.

వేతనదారులు విలవిల!

- మండే ఎండల్లో ఉపాధి పనులు
- పని ప్రదేశాల్లో కానరాని సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు



వడదెబ్బకు మృతి చెందిన దున్న దుర్యోధన (ఫైల్)



లొద్దపుట్టిలో మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులు విలవిలలాడుతున్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా ఉపాధి పనులు జరిగేచోట ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పరదాలు (టార్పాలిన్లు) ఏర్పాటు చేయాలి. అలాగే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచడంతోపాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వేతన జీవులకు అదనపు భత్యం జమ చేయాలి. అయితే పనులు జరుగుతున్న చోట్ల సౌకర్యాలు లేక..ఎండ వేడిమికి తాళలేక వేతనదారులు చెట్ల కింద సేదతీరాల్సి వస్తోంది. మజ్జిగ మాట అటుంచితే కనీసం గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు లేకుండా పోతుంది. మట్టిని తవ్వేందుకు గునపాలకు డబ్బులు ఊసే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలు కల్పించేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంపై కూలీలు నిట్టూరుస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో గరిష్టంగా 33–35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రతను ఊహిస్తుంటే భయమేస్తుందని.. ఈ నేపథ్యంలో పనులు జరిగేచోట కనీస సౌకర్యాలు కల్పించాలని వేతనదారులు కోరుతున్నారు.

ఆరు మండలాల్లో పనులు చేస్తున్న వేతనదారులు వివరాలు ఇలా..			
మండలం	పనుల సంఖ్య	జాబ్ కార్డుల సంఖ్య	ప్రస్తుతం పనులు చేస్తున్నవారు
ఇచ్ఛాపురం	61	9,455	3,320
కవిటి	53	12,314	3,770
కంచిలి	100	12,573	5,047
సోంపేట	65	9,897	3,403
మందస	91	17,543	7,552
పలాస	65	7,784	3,560
మొత్తం	431	69,566	26,652

వడదెబ్బ తగిలే ప్రమాదం

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో వేతనదారులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. గత ఏడాది మే నెలలో బూర్జపాడు పంచాయతీ చిన్నలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారుడు దున్న దుర్యోధన వడదెబ్బకు గురై పని ప్రదేశంలోనే మృతి చెందాడు. ఎండలో ఎక్కువసేపు పనిచేయడం వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. పని చేసే సమయంలో మంచినీరు తాగకపోతే నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



పని ప్రదేశాల్లో వేతనదారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైతే వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాం. ఈ నెలాఖరులోగా బకాయిలు వేతనదారుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎండాకాలం ముగిసే వరకు వేతనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే వేతనదారులు పనులు చేసుకునేలా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశాం.

– చల్లా శ్రీనివాసరెడ్డి, డ్వామా ఏపీడీ

ఇంత వరకు పరిహారం రాలేదు



నా భర్త గత ఏడాది మే నెల 25న ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురై పని ప్రదేశంలోనే మృతి చెందాడు. నేటికి ఏడాది కావస్తున్నా నయా పైసా పరిహారం కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిహారం ఇప్పిస్తారని ఎదురు చూస్తున్నాం.

– దున్న దాలమ్మ (మృతుడు దుర్యోధన భార్య), లక్ష్మీపురం, ఇచ్ఛాపురం మండలం

నిలువ నీడ లేదు



పని ప్రదేశాల్లో నిలువ నీడ ఉండడం లేదు. మూడు నెలలుగా వర్షాలు లేకపోవడంతో మట్టిని తవ్వలేకపోతున్నాం. త్వరగా అలసిపోతుండటంతో వేతనదారులమంతా దాహంతో అలమటించిపోతున్నాం. ఇంటి వద్ద నుంచి బాటిల్‌తో తెచ్చిన నీరు తప్పా పని ప్రదేశం వద్ద నీరు ఉండటం లేదు. నీడ కోసం తాటి, కొబ్బరి కమ్మలతో తెరచాటు చేసుకుంటున్నాం. ఎండలు మండుతున్నందున ప్రభుత్వం నీడ కోసం పరదాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– బడే హేమలత, వేతనదారు, డొంకూరు, ఇచ్ఛాపురం మండలం

రైతులకు ఉపయోగపడుతున్న యంత్ర సేవా పరికరాలు



సోంపేట: రుషికుద్దలో యంత్ర పరికరాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి



టెక్కలి రూరల్: పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న కిరణ్‌వాణి

సోంపేట: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 40 శాతం రాయితీతో అందజేసిన యంత్ర సేవా పరికరాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని పలువురు రైతులు వ్యవసాయాధికారుల వద్ద స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి రుషికుద్ద, లక్కవరం,బారువ, బారువపేట, సోంపేట గ్రామాల్లోని యంత్ర సేవా కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పనిముట్లు, రికార్డు నిర్వహణను పరిశీలించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని రైతులకు సూచించారు.

రైతులు వినియోగించుకోవాలి

టెక్కలి రూరల్: కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో 40 శాతం రాయితీపై అందించిన వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రంలో అద్దెకు కావాలసిన పరికరాల వివరాలను నమోదు చేసుకుంటే వాటిని రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వేసవి దుక్కులకు రైతులు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్కలి ఏడీఏ బి.వి.తిరుమలరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి మండలం నర్సింగపల్లిలోని కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి సందర్శించారు. అందజేసిన పరికరాలు, వాటి వినియోగం, పరికరాల లభ్యత, రైతులు ఎలా వినియోగిస్తున్నారు, బ్యాంకు రుణాల చెల్లింపులపై వీఏఏ వై.యమునను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు, డీఏవో కార్యాలయం ఏడీఏ టి.భవానీశంకర్, ఎంఏఓ రంగారావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: సీతాపురం, పెద్దబొడ్డపాడు, దేవునల్తాడ గ్రామాల్లోని కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలను మండల వ్యవసాయాధికారి కిరణ్‌వాణి సందర్శించారు. యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది జ్యోత్స్న, శివ, అపర్ణ తదితరులు ఉన్నారు.

సామాజిక భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సామాజిక భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలన్నారు. ప్రతీ పంచాయతీలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ రవిచంద్ర, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘మాజీ సీఎం జగన్ భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదు’



మాట్లాడుతున్న మోహన్‌రావు

టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భద్రత విషయంలో ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం మంచిది కాదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగుపురం మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల చేస్తున్న పర్యటనల్లో భాగంగా అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారని గుర్తు చేశారు. గతంలో చేపట్టిన పర్యటనల దృష్ట్యా భద్రత విషయంలో ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరితో ఎన్నో రకాల ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. భద్రతా లోపం వలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా దానికి ప్రభుత్వమే సంజాయిషీ చెప్పాల్సి ఉంటుందన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

సోంపేట: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలని మండల యాంకర్ కుమారి అన్నారు. జీడిపుట్టుగ గ్రామంలో నవధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుగా నవధాన్యాలు సాగు చేయడం వలన నేల సారవంతంగా మారుతుందన్నారు ఐసీఆర్‌పీఎస్‌లు హైమావతి, శ్రావణి పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

సంతబొమ్మాళి: నౌపడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కర్రి కృష్ణవేణి కుమారుడు నాగిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కింజరాపు హరిప్రసాద్, జీరు భీమారావు, అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న ఉన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉంటుందని ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పీవో పురాణం నాగరాణి అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేతులు పరిశుభ్రతపై చిన్నారులకు, లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు నీలవేణి, సుజాత, లక్ష్మి, పల్లవి, పుష్పలత, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: తన భార్య కనిపించడం లేదని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు పురుషోత్తపురం గ్రామానికి చెందిన రైవాడ లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారని కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

జాబ్‌మేళాకు వందమంది హాజరు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు వందమంది హాజరైనట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాల కోసం డిజైనింగ్ టుమారోస్ హెచ్ఆర్ మేనేజర్ శ్రావణి తలశిల ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను నిర్వహించారు. ఇందులో 30 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు వి.అశోక్‌కుమార్, కె.వి.ఎల్.భవాని పాల్గొన్నారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల వేదికకు 12 వినతులు



వృద్ధ దంపతుల సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని పోలీసు డివిజన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికకు 12 వినతులు అందాయి. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు..



అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు కంచిలి మండలలోని పలు సన్నిధానాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రం కంచిలిలోని కంచమ్మతల్లి ఆలయం ఆవరణ, రాధాకృష్ణ ఆలయం, మకరాంపురం, నరసన్నముకుందాపురం గ్రామాల్లోని సన్నిధానాల్లో నిర్వహించిన వేడుకల్లో అయ్యప్ప భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. – కంచిలి

బడికి బీరువాలు వితరణ..



ఇచ్ఛాపురం మండలం మండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన రెడ్డిక సంఘం, బెహరా సంఘం సంయుక్తంగా సుమారు రూ. 37 వేలు విలువైన మూడు బీరువాలను వితరణ చేశారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాడు ప్రకాశరావుకు వీటిని అందజేశారు. సర్పంచ్ పిట్ట మామయ్యరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తరిణీ బెహరా, ఎస్ఎంసీ చైర్మన్ మాయావతి బెహరా, ఎంపీటీసీ మాజీ సభ్యులు పి.చంద్రశేఖర్, పి.భీమారావు, వెంకటేష్, అనీల్, ఘనశ్యామ్ పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

పూర్వ విద్యార్థుల ఔదార్యం..



కవిటి మండలం బొరివంక ప్రభుత్వ పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదరాన్ని చాటుకున్నారు. 15 వేల రూపాయలతో 40 ప్లాస్టిక్ కుర్చీలను పాఠశాలకు సమకూర్చారు. వీటిని శుక్రవారం హెచ్ఎం సనపల రామకృష్ణ సమక్షంలో అందజేశారు. పూర్వవిద్యార్థి సంఘం ప్రతినిధులు రుంకు కృష్ణారావు మాస్టారు, సనపల శ్రీపతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. – కవిటి

నల్ల చట్టాలతో రైతుల నడ్డి విరుస్తున్న కేంద్రం



బెండిలో జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల ముందు రైతులకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత నల్ల చట్టాలను తీసుకువచ్చి వారి నడ్డి విరుస్తున్నారని రైతు సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంపల్లి, బెండి గ్రామాల్లో అఖిల భారత రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభ 1936లో ఆవిర్భవించి నేటికి 90 ఏళ్లు గడిసిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రైతుల పాలిట శాపంగా మారాయని ధ్వజమెత్తారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేశారని, ఎరువులు, పురుగు మందులు, విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యుల నెత్తిపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. రైతు సంఘ నాయకులు కె.వెంకటరావు, కె.బాలాజీ, కె.సూధన్, బి.రామక్రిష్ణ, టి.లక్ష్మి, నీలాచలం ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



పలాస: నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



టెక్కలి: నిరసనలో ఆర్టీసీ ఉద్యోగులు

టెక్కలి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ టీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి ఆర్టీసీ డిపో ఎదురుగా నిరసన చేపట్టారు. ఉద్యోగుల భద్రత పై 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను ఆపాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. రీజనల్ జాయింట్ సెక్రటరీ బి.ధనుంజయరావు, డిపో అధ్యక్షుడు టి.రమణమూర్తి, ప్రతినిధులు కె.సూరిబాబు, ఎం.ఎస్.చలం, టి.రమేష్, కె.బాబూరావు, ఎస్.రమేష్, ఎస్.ఎస్.రావ్, డి.రామారావు, ఎస్.ప్రసాద్, బి.త్రినాథ్, ఎస్.వి.రెడ్డి పాల్గొన్నారు.

పలాస: పలాస ఆర్టీసీ డిపో మెయిన్ గేటు ఎదురుగా రెండో రోజైన శుక్రవారం కూడా ఉద్యోగులు ధర్నా చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు పి.వాలి, ఎ.వి.రావు, డి.ఎల్.నారాయణ, హెచ్.వి.మూర్తి, టి.డి.రావు, సి.ఎం.రావు ఉన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులు



కంచిలి: జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు



టెక్కలి రూరల్: కోటబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు తదితరులు



సోంపేట: జ్యోతిరావు పూలే చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలోని విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ ప్రతినిధులు



మందస: సొండిపూడిలో నివాళులర్పిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ ప్రతినిధులు

సంఘ సంస్కర్త, రచయిత జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని వక్తలు అన్నారు. పూలే జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కస్తూర్బాగాంధీ జీవితం స్ఫూర్తిదాయకం



కవిటి: కస్తూర్బాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: జాతిపిత మహాత్మాగాంధీ భార్య కస్తూర్బాగాంధీ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమైనదని కొత్తపాలెం కేజీబీవీ ప్రత్యేక అధికారి పొల్లాయి లక్ష్మీదేవి అన్నారు. కస్తూర్బాగాంధీ జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కస్తూర్బాగాంధీ పేరిట కేంద్ర ప్రభుత్వం బాలికా విద్యాలయాలు ఏర్పాటుచేసి పేద, మధ్య తరగతి వర్గాల బాలికల చదువులకుఅవకాశం కల్పించడం ఆదర్శనీయమన్నారు.